
**బీఆర్ఎస్‌లోనే ఉన్నాం..**



2





2

**ఘనంగా సేవాలాల్ జయంతి**



AKSHARA TODAY

అక్షర టుడే

TOWARDS... TRUTH. TRUST. TREND

www.aksharatoday.in


## యథావిధిగా ప్రజావాణి కార్యక్రమం

**అక్షరటుడే, ఇందూరు:** ప్రజావాణి కార్యక్రమాన్ని ఈనెల 16వ తేదీ (సోమవారం) నుంచి యథావిధిగా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రతి సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణిని మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉండడం తాత్కాలికంగా రద్దు చేశామన్నారు. మున్సిపల్ ఎన్నికల ప్రక్రియ ముగిసినందున ప్రజావాణి కార్యక్రమం ఎప్పటిలాగే కొనసాగుతుందని కలెక్టర్ తెలిపారు. ప్రజలు తమ సమస్యలపై కలెక్టరేట్‌లో ఫిర్యాదులు సమర్పించాలని సూచించారు.


15-2-2026 | NIZAMABAD / KAMAREDDY | PAGES - 2




# శంభో శివశంభో..

మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని జిల్లాలోని శైవక్షేత్రాలు శివనామస్మరణతో మార్మోగాయి. హరహర మహాదేవ శంభోశంకర.. పాహిమాం.. పాహిమాం అంటూ భక్తులు పులకించిపోయారు. భోళా శంకరుడిని దర్శించుకునేందుకు వేకువజాము నుంచే ఆలయాలకు బారులు తీరారు. బిల్వపత్రాలు, పూలు సమర్పించి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. పలు ఆలయాల్లో శివపార్వతుల కల్యాణోత్సవం, పల్లకీసేవ నిర్వహించారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆయా ఆలయ కమిటీల ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. – అక్షరటుడే, నెట్‌వర్క్



# చైర్‌పర్సన్ పీఠం ఎవరికో..

- ఉత్కంఠ రేపుతున్న కామారెడ్డి బల్దియా రాజకీయం
- మద్దతు కోసం ఎవరి ప్రయత్నాలు వారివే

**కామారెడ్డి బల్దియా పీఠం చిక్కుముడి వీడటం లేదు. కాంగ్రెస్, బీజేపీలకు మ్యాజిక్ ఫిగర్ రాకపోవడంతో గందరగోళం నెలకొంది. సోమవారం చైర్ పర్సన్ ఎన్నిక నేపథ్యంలో ఉత్కంఠ నెలకొంది. ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ మద్దతు కీలకం కావడంతో ఇరు పార్టీల నాయకులు బీఆర్ఎస్ కౌన్సిలర్లను తమవైపు తిప్పుకొనేందుకు ఎవరి ప్రయత్నాలు వాళ్లు చేస్తున్నారు.**

**- అక్షరటుడే, కామారెడ్డి**


కామారెడ్డి బల్దియాలో 49 వార్డులు ఉండగా కాంగ్రెస్ 19, బీజేపీ 16, బీఆర్ఎస్ 11 స్థానాల్లో గెలుపొందాయి. స్వతంత్రంగా గెలిచిన ముగ్గురు అభ్యర్థులు కాంగ్రెస్ గూటికి చేరారు. దీంతో ఆ పార్టీ బలం 22కు చేరింది. ఈ నేపథ్యంలో పలువురు బీఆర్ఎస్ నేతలను తమ తిప్పుకునేందుకు అధికార పార్టీ యత్నిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. మరోవైపు బీజేపకి మున్సిపల్ పీఠం దక్కుతుందని చర్చ సాగుతోంది. ఇప్పటికే మూడు పార్టీలు కౌన్సిలర్లను క్యాంపునకు తరలించారు. అయితే బీఆర్ఎస్‌కు చెందిన ముగ్గురు కౌన్సిలర్లు కాంగ్రెస్‌కు మద్దతు తెలిపేందుకు సంసిద్ధం వ్యక్తం చేసినట్టుగా చర్చ నడుస్తోంది.

### బీఆర్ఎస్ దారెటు?


తమ కౌన్సిలర్లు ఎవరికి మద్దతు ఇవ్వడం లేదని, పార్టీ అధిష్ఠానం నిర్ణయమే ఫైనల్ అని బీఆర్ఎస్ ముఖ్య నేతలు చెబుతున్నారు. బీఆర్ఎస్ చుట్టూనే కాంగ్రెస్, బీజేపీ రాజకీయాలు కొనసాగుతున్నాయి. దాంతో బీఆర్ఎస్ అధిష్ఠానం నిర్ణయం ఎలా ఉండబోతోందని చర్చ సాగుతోంది. మరోవైపు కాంగ్రెస్ పార్టీకి మద్దతిస్తే కామారెడ్డిలో పార్టీకి నష్టం జరుగుతుందని మెజారిటీ కౌన్సిలర్లు బలంగా తమ వాదన వినిపిస్తున్నారన్న టాక్ పొలిటికల్ వర్గాల్లో సాగుతోంది.

# మేయర్ ఎన్నిక ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్

**అక్షరటుడే, ఇందూరు:** నగరపాలక సంస్థ కార్యాలయాన్ని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదివారం సందర్శించారు. మేయర్ ఎన్నిక కార్యక్రమం సోమవారం జరగనున్న నేపథ్యంలో ఆమె కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ దిలీప్‌కుమార్‌తో మాట్లాడారు. నూతనంగా ఎన్నికైన కార్పొరేటర్లతో పాటు ఎక్స్ అఫీషియో సభ్యుల హోదాలో ఎంపీ, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు హాజరుకానున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. నిజామాబాద్ కార్పొరేషన్‌తో పాటు బోధన్, ఆర్మూర్, భీమ్‌గల్ మున్సిపాలిటీలో ఎలాంటి లోటుపాట్లకు తావు లేకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఆయా మున్సిపాలిటీల వద్ద కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేయాలని పోలీసులకు సూచించారు. మున్సిపల్ కార్పొరేషన్‌లో.. ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. ముందుగా నూతనంగా ఎన్నికైన కార్పొరేటర్లు, కౌన్సిలర్లతో స్పెషల్ ఆఫీసర్లు ప్రమాణ స్వీకారం చేయిస్తారని పేర్కొన్నారు. అనంతరం రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్దేశించిన విధంగా మధ్యాహ్నం 12:30 గంటలకు మేయర్, డిప్యూటీ మేయర్ చైర్మన్, వైస్ చైర్మన్ల ఎన్నిక జరుగుతుందన్నారు. పూర్తి పారదర్శకంగా ఎన్నిక ప్రక్రియ నిర్వహించాలని స్పష్టం చేశారు. కలెక్టర్ వెంట ఆర్డీవో రాజేంద్రకుమార్, తదితరులు ఉన్నారు.



**జిల్లాలో మున్సిపల్ ఎన్నికల ఫలితాలు వెలువడ్డాయి. ఇక మేయర్, చైర్ పర్సన్ల ఎన్నిక మాత్రమే మిగిలింది. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు కార్పొరేషన్ కార్యాలయంలో, అన్ని బల్దియాలలో అధికారులు ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇక నిజామాబాద్ మేయర్‌గా.. అలాగే మూడు మున్సిపాలిటీల చైర్‌పర్సన్లుగా ఎవరు ఎన్నికవుతారనే ఉత్కంఠ జిల్లా ప్రజల్లో నెలకొంది. – అక్షరటుడే, ఇందూరు**



నిజామాబాద్ కార్పొరేషన్ మేయర్ ఎన్నికకు సంబంధించి నగరపాలక సంస్థ కార్యాలయంలో అధికారులు ఏర్పాట్లు చేశారు. అలాగే బోధన్, ఆర్మూర్, భీమ్‌గల్ చైర్‌పర్సన్ల ఎన్నిక నిర్వహించేందుకు సంబంధిత మున్సిపల్ కార్యాలయాల్లో అధికారులు సిద్ధమయ్యారు. జిల్లా కలెక్టర్‌తో పాటు సంబంధిత మున్సిపాలిటీల్లో కలెక్టర్ నియమించిన గెజిటెడ్ అధికారి ఎన్నికలను నిర్వహిస్తారు. ఇందుకోసం ఇప్పటికే కార్యాలయాలను ముస్తాబు చేశారు. అలాగే అధికారులను సైతం నియమించారు.

- బోధన్, ఆర్మూర్, భీమ్‌గల్‌లో చైర్‌పర్సన్ల ప్రమాణస్వీకారం..
- ఎన్నికల సంఘం ఆదేశాలతో ఏర్పాట్లు పూర్తి
- ఉత్కంఠగా ఎదురుచూస్తున్న జిల్లావాసులు

# రేపే మేయర్ ఎన్నిక

### ఎన్నిక ఇలా..

తెలంగాణ పురపాలక చట్టం 2019లోని సెక్షన్-20 ప్రకారం ప్రతీ కార్పొరేషన్‌కు ఒక మేయర్, ఉపమేయర్ ప్రతి మున్సిపాలిటీకి చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్‌ను ఎన్నుకోవాలి. నేరుగా ఎన్నికైన కార్పొరేటర్లు, కౌన్సిలర్లు మాత్రమే ఈ పదవుల పోటీకి అర్హుల. ఎన్నిక జరిగే నగరపాలక సంస్థ కార్యాలయంతో పాటు సంబంధిత మున్సిపాలిటీల హాలు వేదికపై అధికారులు పరిశీలకులు కూర్చుంటారు.

### డిస్‌ప్లే బోర్డుల ఏర్పాటు..

జాతీయ, రాష్ట్ర పార్టీల సభ్యులకు, రిజిస్టర్డ్ పార్టీల సభ్యులు, స్వతంత్ర అభ్యర్థులకు విడివిడిగా స్థలాలు కేటాయిస్తారు. ప్రతి సభ్యుల గ్రూప్ ముందు ఒక డిస్‌ప్లే బోర్డు ఏర్పాటు చేస్తారు. దీంతో ఎవరు ఎక్కడ కూర్చున్నారో సులభంగా గుర్తించే అవకాశం ఉంటుంది. ప్రధానంగా మేయర్, చైర్‌పర్సన్ ఎన్నిక సమయంలో అభ్యర్థు లు చేతులెత్తి తమ సమ్మతిని తెలియజేస్తారు. ఇద్దరికీ సమానంగా ఓట్లు వస్తే లాటరీ పద్ధతి ద్వారా విజేతను నిర్ణయిస్తారు. అనంతరం డిప్యూటీ మేయర్, వైస్ ఛైర్మన్‌ల ఎన్నిక నిర్వహిస్తారు.

### ఎక్స్ అఫీషియో సభ్యులు..

మేయర్, చైర్‌పర్సన్‌ల ఎన్నిక సమయంలో ఇరు పార్టీల సభ్యులు ఎక్స్ అఫీషియో ఓట్లను వినియోగించుకునే అవకాశం ఉంటుంది. ఈ నేపథ్యంలో ఎన్నికల సంఘం సంబంధిత మున్సిపాలిటీలో ఓటు హక్కు ఉన్నవారే దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. దీంతో జిల్లాలో బీజేపీ నుంచి ఎంపీ అర్వింద్, ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా, ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి, కాంగ్రెస్ నుంచి పీసీసీ అధ్యక్షుడు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి దరఖాస్తు చేసుకున్నారు.

### పోలీసుల బందోబస్తు..

మేయర్, చైర్ పర్సన్‌లో ఎన్నిక నేపథ్యంలో జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల పరిధిలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు చేపట్టారు.

### కామారెడ్డి జిల్లాలో..

కామారెడ్డి జిల్లాలో నాలుగు మున్సిపాలిటీలలో ఛైర్మన్ ఎన్నికకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఎల్లారెడ్డి, బాన్సువాడ, బిచ్కుంద మున్సిపాలిటీలు స్పష్టమైన మెజారిటీతో కాంగ్రెస్ కైవసమయ్యాయి. దాంతో ఆ మున్సిపాలిటీలలో ఛైర్మన్ అభ్యర్థుల ప్రకటనే మిగిలి ఉంది. ఈ మేరకు ఛైర్మన్ అభ్యర్థుల ఎంపిక కూడా పూర్తయినట్టుగా తెలుస్తోంది. ఇక కామారెడ్డిలో సోమవారం ఉదయం ఏ పార్టీకి బలం ఉంది.. ఛైర్మన్ అభ్యర్థి ఎవరు అనేది తెలియనుంది. ఈ మేరకు అన్ని మున్సిపాలిటీల్లో ఛైర్మన్ ఎన్నికకు సంబంధించిన ఏర్పాట్లు ముమ్మరంగా చేస్తున్నారు. మున్సిపాలిటీలో కొత్త పాలకవర్గానికి స్వాగతం పలికేందుకు కార్యాలయంలో పెయింటింగ్ పనులు చేస్తున్నారు.


నగరంలోని నందిగుట్ట ఆలయంలో అభిషేకం చేస్తున్న భక్తులు


ఎల్లారెడ్డిలో శివపార్వతుల కల్యాణం నిర్వహిస్తున్న భక్తులు



# శంభో శివశంభో.




నగరంలోని కంఠేశ్వర్ శివాలయంలో ఎమ్మెల్యే ధన్‌పాల్..



నగరంలోని శంభుని గుడిలో..




శ్రీ శంభు లింగేశ్వర ఆలయంలో..






బడాభీమ్‌గల్‌లోని రాజరాజేశ్వర స్వామి ఆలయంలో..


గాంధారి మండలంలోని భోగేశ్వర ఆలయంలో భక్తుల సందడి


తిమ్మాపూర్ లో శివపార్వతుల విగ్రహాలను తీసుకెళ్తున్న భక్తులు..


ఆర్మూర్ నవనాథ సిద్ధుల గుట్టపై..


బడాభీమ్‌గల్ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో..



బాన్సువాడలో..

## ఘనంగా సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి



**అక్షరటుడే, బాన్సువాడ:** బంజారాల ఆధ్యాత్మిక గురువు సంత్ సేవాలాల్ మహరాజ్ 287వ జయంతి వేడుకలను ఆదివారం బాన్సువాడ మండలం పోచారం, రాంపూర్ తండాలో ఘనంగా నిర్వహించారు. బంజారా సమాజానికి సేవాలాల్ చేసిన సేవలను ఈ సందర్భంగా గుర్తుచేసుకుంటూ, ఆయన బోధనలు సమాజానికి మార్గదర్శకంగా నిలుస్తాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా తండా పెద్దలు, మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై భోగ్ బండార్ నిర్వహించారు. సేవాలాల్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం బంజారా సంప్రదాయ పూజలు నిర్వహించి జయంతి వేడుకలను ఆధ్యాత్మిక వాతావరణంలో జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో తండానాయక్ గోప్యా నాయక్, కారోబారి ప్రకాష్, మాజీ వైస్ ఎంపీపీ హరిసింగ్, ఆల్ ఇండియా బంజారా సేవా సంఘ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బానోత్ మోహన్ నాయక్, ఆలయ కమిటీ ఛైర్మన్ బలరాం నాయక్, రాంపూర్ తండా సర్పంచ్ ఫకీరా, పోచారం సర్పంచ్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## జిరాయత్ నగర్ హనుమాన్ ఆలయంలో స్వచ్ఛ భారత్..



**అక్షరటుడే, ఆర్మూర్:** పట్టణంలోని జిరాయత్ నగర్‌లోని హనుమాన్ ఆలయం ఆవరణలో ఆదివారం స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు. ఆర్మూర్ మహాత్మ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో భాగంగా ఆలయం ఆవరణలో పెరిగిన పిచ్చిమొక్కలు, చెత్తచెదారాన్ని తొలగించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సుంకె శ్రీనివాస్ మాట్లాడుతూ.. 42 వారాలుగా ఈ స్వచ్ఛ కార్యక్రమం నిర్విరామంగా కొనసాగుతోందని, ఇందులో భాగంగా జిరాయత్ నగర్‌లోని హనుమాన్ ఆలయంలో స్వచ్ఛ కార్యక్రమం నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు అంబల్ల తిరుపతి, ఆలయ పూజారి పెరంబుదూరి సీనయ్య స్వామి, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## కల్లుగీత కార్మికుల ఆశాజ్యోతి ధర్మభిక్షం



**అక్షరటుడే,కోటగిరి:** కల్లుగీత కార్మికుల ఆశాజ్యోతి కార్మిక నాయకుడు ధర్మభిక్షం అని రాష్ట్ర గీత పనివాళ్ల సంఘం రాష్ట్ర కార్యదర్శి ఏ విఠల్ గౌడ్ అన్నారు. మండల కేంద్రంలో సంఘం ఆధ్వర్యంలో ధర్మభిక్షం జయంతిని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కోటగిరి మండల కేంద్రంలో ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు గీత కార్మికులు, గౌడ కులస్థులు పండ్లు పంపిణీ చేశారు. అనంతరం విఠల్ గౌడ్ మాట్లాడుతూ.. కార్మికుల కోసం అహర్నిశలు పోరాడిన ధర్మభిక్షం మూడుసార్లు పార్లమెంట్ సభ్యుడిగ ఎన్నికయ్యాడన్నారు. ఆయన చేసిన పోరాటాల ద్వారా కార్మికులు తమ హక్కులను సాధించుకోగలిగారన్నారు. ఈ కార్యక్రమంలో గీత పనివార్ల సంఘం మండల అధ్యక్షుడు వెంకాగౌడ్, ఉపాధ్యక్షుడు నరేష్ గౌడ్, రాజా గౌడ్, శ్రీనివాస్ గౌడ్, ప్రవీణ్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్‌లోనే ఉన్నాం.. కామారెడ్డిలో కౌన్సిలర్ల ప్రకటన



**అక్షరటుడే, కామారెడ్డి:** తాము బీఆర్ఎస్ పార్టీలోనే ఉన్నామని.. ఇతర పార్టీల ప్రలోభాలకు లొంగలేదని కామారెడ్డి పట్టణ బీఆర్ఎస్ కౌన్సిలర్లు పేర్కొన్నారు. ఈ మేరకు వారు ఆదివారం మధ్యాహ్నం ప్రకటన విడుదల చేశారు. హైదరాబాద్‌లో క్యాంప్ లో ఉన్న నలుగురు బీఆర్ఎస్ కౌన్సిలర్లు మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ముజీబొద్దీన్ సమక్షంలో వీడియో విడుదల చేశారు. తాము కాంగ్రెస్‌లో చేరామని పేర్కొంటూ వస్తున్న వార్తలను ఖండించారు. బీఆర్ఎస్‌కు చెందిన గెరిగంటి లక్ష్మీనారాయణ, గెరిగంటి స్వప్న, పిట్ల వేణుగోపాల్, హఫీజ్ భేగ్‌లు తాము బీఆర్ఎస్‌లోనే ఉన్నామని తెలిపారు. తమ పార్టీ అధిష్టానం గీసిన గీత దాటే ప్రసక్తే లేదన్నారు. తాము ఎలాంటి ప్రలోభాలకు లొంగలేదని తెలిపారు. సోమవారం పార్టీ అధిష్టానం నిర్ణయం ప్రకారమే నడుచుకుంటామని స్పష్టం చేశారు. గిట్టని వాళ్లు చేస్తున్న ప్రచారాలను కామారెడ్డి ప్రజలు నమ్మవద్దని కోరారు. కాగా పలువురు బీఆర్ఎస్ కార్పొరేటర్లు కాంగ్రెస్‌కు మద్దతు ఇచ్చినట్లు ప్రచారం జరిగింది. దీంతో ఆ పార్టీ నాయకులు వీడియో విడుదల చేశారు.